ఆర్యవైశ్య క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



సికింద్రాబాద్: ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పొద్దటూరింకటేశ్వరరావు (బాబు), ప్రతినిధులు ప్రభాకర్, రమేశ్, రాజనర్సింహా, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ వైద్యుల అరుదైన చికిత్స

రాంగోపాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు కిమ్స్ వైద్యులు అరుదైన చికిత్స చేశారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ యూరో గైనకాలజిస్ట్ డాక్టర్ బిందుప్రియ తెలిపిన మేరకు.. ప్రకారం నగరానికి చెందిన 37 ఏళ్ల ఓ మహిళ డెంగీతో బాధపడుతూ కడుపు నొప్పితో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చింది.ఆమెకు అంతర్గత రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. వెంటనే లాప్రోస్కోపిక్ సర్జరీ చేసి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు.డెంగీ వచ్చిన వారిలో అంతర్గత రక్తస్రావం జరుగుతుందని పలు రకాల లక్షణాల్లో ఇది ఒకటని డాక్టర్ బిందుప్రియ తెలిపారు. శస్త్ర చికిత్సలో పిజీషియన్ డాక్టర్ శివరాజు, జనరల్ సర్జన్ డాక్టర్ ఎంబీవీ ప్రసాద్, ఎంఐసీయూ వైద్యులు డాక్టర్ పవన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల విరాళం



బన్సీలాల్‌పేట్: బోలక్‌పూర్ క్రిష్టానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు తేరాపంత్ యువక్ పరిషద్ కంప్యూటర్లు, ఇతరత్రా విలువైన వస్తూసామగ్రిని అందజేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో తేరాపంత్ యువక్ పరిషద్ అధ్యక్షులు అభినందన్ నహతా, ప్రధాన కార్యదర్శి అనిల్ దుగర్ పాల్గొన్నారు.

హామీల అమలుకు ఉద్యమిస్తాం

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఎస్సీల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఉద్యమిస్తామని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ మహంకాళి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు రాజు, జమ్మికుంట వేణు, పప్పుల కృష్ణమూర్తి, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు పలువురి శుభాకాంక్షలు



లాలాపేట: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ప్రొ. కోదండరాంకు వివిధ వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ యోగా అసోసియేషన్ నాయకులు ప్రొ టి. వెంకట్రాజం, డాక్టర్ పి. జీవన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓపెన్ వర్సిటీ ప్రవేశాల గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాల గడువు పొడిగించాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నేటితో (18న) దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని, వరుస సెలవు కారణంగా అనేక మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు మరోక 15 రోజుల పాటు గడువు పొడించాలని వర్సిటీ వీసీని కోరారు.

ఆ కుటుంబమే ఓ దొంగల ముఠా

- బైక్ దొంగల ముఠాల అరెస్టు
- 13 వాహనాలు స్వాధీనం

లాలాపేట: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బైక్ దొంగల ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఓయూ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌తో కలిసి ఏసీపీ జగన్ వివరాలను వెల్లడించారు. మల్లాపూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సమద్(41),సాహెరా(30) భార్యాభర్తలు. తమ మైనర్ కుమారులు ఇద్దరితో కలిసి కొంత కాలంగా ద్విచక్ర వాహనాల దొంగతాలనకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వాహనాలను విడి భాగాలుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరితో పాటుగా నిజాంపేట్‌కు చెందిన రాము(19), రాజేష్(19) ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దొంగల ముఠాను చేదించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 13 ద్విచక్ర వాహనాలను, కొన్ని వాహనాల విడిభాగాలను స్వాదీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా సాహెరా ఫరారీలో ఉందన్నారు.

చికిత్స కోసం వచ్చిన యువకుడి అదృశ్యం

సికింద్రాబాద్: చికిత్స కోసం వచ్చిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌కు చెందిన వరదరాజు తన కుమారుడు మహేంద్ర విఠల్‌సాయిరాజు (19)కు చికిత్స చేయించేందుకు ఈనెల 12న భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. సోమాజిగూడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కుమారుడికి వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం తిరిగి వెళ్లేందుకు ఈనెల 16న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైలు కోసం ఎదురు చూస్తున్న సమయంలో విఠల్‌సాయిరాజు కనిపించకుండా పోయాడు. కుమారుడి కోసం వివిధ ప్రాంతాల్లో గాలించిన వరదరాజు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై దారుణంగా లైంగికదాడి చేసి హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు జరుగకుండా ఉరి శిక్ష విధించాలని పలువురు వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. వైద్యులు, జూనియర్ డాక్టర్లు, ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్లు తమ నిరసనలతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీలో జూడాలు విధులు బహిష్కరించడంతో క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు.



యశోద ఆస్పత్రిలో ఓపీ సేవలను బహిష్కరించిన వైద్యులు

ఉరే.. సరి

‘కోల్‌కతా’ ఘటనపై వైద్యుల ఆగ్రహం

- పలుచోట్ల ఓపీ సేవలు బంద్
- ‘గాంధీ’లో క్యూలైన్లు ఖాళీ

‘యశోద’లో విధుల బహిష్కరణ

రాంగోపాల్‌పేట్: నగరంలో ఉన్న అన్ని యశోద అస్పత్రులలో వైద్యులు ఓపీ సేవలను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ..ఈ సంఘటనను పూర్తిగా ఖండిస్తూ అన్ని యశోద అస్పత్రులలో ఓపీ సేవలను బహిష్కరించినట్లు తెలిపారు.

‘అశోకా’ వైద్యుల ఆగ్రహం

రసూల్‌పురా: కంటోన్మెంట్ పరేడ్ మైదానం వద్ద అశోకా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాహుల్ గుల్వే, వైద్యులు కిరణ్‌కుమార్, నవిత రాహుల్, సచిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐసీలో ఓపీ బంద్

అమీర్‌పేట: సనత్‌నగర్ ఈఎస్ఐసీలో అత్యవసర సేవలు మినహా ఓపీ వైద్య సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. థియేటర్లలో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బంది కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొనడంతో అత్యవసర అపరేషన్లు మినహా ఇతర ఆపరేషన్లను వాయిదా వేశారు. ఇక అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం అర గంట పాటు ఓపీ సేవలను నిలిపివేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ్, వినాయక్‌రావు పాల్గొన్నారు.

‘గాంధీ’లో ప్లకార్డులతో నిరసన

గాంధీఆస్పత్రి : గాంధీ ఆస్పత్రిలో శనివారం జూడాలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ అశోక్ హజారై మద్దతు ప్రకటించారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. సీనియర్ రెసిడెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, జూడాల గాంధీ అధ్యక్షుడు వంశీకృష్ణ పెద్దసంఖ్యలో జూడాలు పాల్గొన్నారు.



అశోకా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిరసన



అమీర్‌పేట ఆసుపత్రి ఎదుట వైద్యుల ఆందోళన

దంత వైద్యుల నిరసన ర్యాలీ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ నుంచి క్లాక్ టవర్ అమరవీరుల స్తూపం వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అబేద్ అలీ, గట్టు సుభాష్‌లు మాట్లాడుతూ.. ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. సుమారు 150 మంది దంత వైద్యులు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. డాక్టర్ పవన్ మహాత్మ, డాక్టర్ దినేష్ నమిలే పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న దంత వైద్యులు



గాంధీ ఆస్పత్రిలో..

పదుల సంఖ్యలోనే ఓపీ సేవలు

గాంధీఆస్పత్రి : చికిత్స కోసం వచ్చిన వారితో నిత్యం కిటకిటలాడే సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఓపీ విభాగం శనివారం బోసిపోయింది. గాంధీ జూడాల విధుల బహిష్కరణతోపాటు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ పిలుపు మేరకు వైద్యులు నల్లబాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సుమారు 2500 నుంచి మూడు వేల మందికి వైద్యసేవలు అందించే గాంధీ ఓపీ విభాగంలో శనివారం కేవలం పదుల సంఖ్యలో రోగులు వైద్యసేవలు పొందారు. కోల్‌కతా జీఆర్ కర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యవిద్యార్థినీపై హత్యాచారం ఘటనతో జూడాలు, వైద్యులు ఆందోళనబాట పట్టిన సంగతి విధితమే. సుమారు వెయ్యి మంది జూడాలు, ఇంటర్నీస్, హౌస్‌సర్జన్లు గాంధీఆస్పత్రి ప్రాంగణంలో సమావేశమై, ప్లకార్డులతో నినాదాలు చేస్తు ర్యాలీగా ధర్నాచౌక్‌కు తరలివెళ్లారు. వైద్యసేవలకు ఎటువంటి విఘాతం కలగలేదని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి స్పష్టం చేశారు. వైద్యులు గంట సమయం విధులు బహిష్కరించారని, తర్వాత నల్లబాడ్జీలు ధరించి ఓపీ, ఐపీ విధులకు హాజరయ్యారని వివరించారు.



ఖాళీగా దర్శనమిస్తున్న గాంధీ చిట్టీల కౌంటర్లు

‘కస్తూర్బా’ విద్యాప్రస్థానం ఎంతో గొప్పది: శ్రీగణేశ్

- ఘనంగా కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు



కస్తూర్బా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతూ, 50 ఏళ్లుగా వేలాది మహిళలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత కస్తూర్బా కళాశాలకు ఉందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లిలోని కస్తూర్బా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలోని కస్తూర్బా కళాశాలలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ఉండటం అభినందనీయం అన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందజేస్తానని అన్నారు. ముఖ్యంగా కస్తూర్బా కళాశాల విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తూ ఉండటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు జానకీరామ్, కె. రమాదేవి, బి.పి. చక్రవర్తి పాల్గొన్నారు.

ఆలయ సుందరీకరణకు రూ.1.50 లక్షల విరాళం

సికింద్రాబాద్: మధురానగర్ బంగారు మైసమ్మ దేవాలయ సుందరీకరణ పనుల కోసం లష్కర్ జిల్లా సాధన సమితి ఉపాధ్యక్షుడు మిట్టపల్లి బాబురావు రూ. 1.50 లక్షల విరాళం అందజేశారు. అక్టోబర్ నెలలో జరగనున్న నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. బాబూరావు తన విరాళాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ సమక్షంలో ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్‌కు అందించారు.



ఎమ్మెల్యే పద్మారావు సమక్షంలో విరాళాన్ని అందిస్తున్న బాబురావు

రూ. 68 లక్షలతో అభివృద్ధి పనులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ జోషికాంపౌండ్ ప్రాంతంలో రూ.68 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. శనివారం ఆమె జోషికాంపౌండ్, దాతర కాంపౌండ్ తదితర ప్రాంతాలను సందర్శించి స్థానికులతో మాట్లాడి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజుసుందర్, సుభాష్‌లతోపాటు స్థానికులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతల అభినందనలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్, ఆనంద్ బాబు, బద్రీనాథ్ యాదవ్, సదానంద్ గౌడ్, తేజ్‌పాల్ తదితరులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి..



బహుమతులు అందుకున్న విద్యార్థులతో శ్రీనివాస్, కొండల్‌రావు, అఖిల, జేఎస్‌టీ శాయి

సనత్‌నగర్: మత్తు పదార్థాలు–దుష్పరిణామాలు–నిషేధం’ అంశంపై మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సాంస్కృతిక బంధు, మోడల్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షతన కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి జీహెచ్ఎంసీ ఖైరతా బాద్ సర్కిల్ యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సందేశమిచ్చారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడుస్తూ తమ లక్ష్యాలను నెరవేర్చుకుని దేశ ప్రగతిలో భాగస్వాములుగా నిలవాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్: గణపతి నవ రాత్రి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ నిర్వాహకులు పోలీసు నిబంధనలు పాటించాలని చిలకలగూడ ఏసీపీ వి.జైపాల్‌రెడ్డి కోరారు. శనివారం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ కమ్యూనిటీహాలులో వేడుకల నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండప నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించినా, మండపాలద్ద ప్రైవేటు వ్యక్తులు అలజడి సృష్టించినా కఠిన చర్యలుకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్లు అనుదీప్ (చిలకలగూడ), కరుణాకర్‌రెడ్డి (లాలాగూడ), కే.రమేశ్‌గౌడ్ (వారాసీగూడ), సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి

వ్యక్తి అదృశ్యం



నరేష్

రాంగోపాల్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మహంకాళి పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్డీరోడ్డుకు చెందిన నరేష్ కుమార్ కటారి (43)ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల గాలించినా ఎక్కడ చూకీ కనిపించకపోయే సరికి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు క్రీడాపరికరాలు అందజేత

చిలకలగూడ : గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకుడు తీగుళ్ల రామేశ్వరగౌడ్ శనివారం మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించారు. శనివారం మంత్రి క్యాంపస్‌కు వచ్చిన మంత్రిని కలిసి ..కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కులగణన చేపట్టి బీసీలకు జనాభ దమాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఓయూ కన్వీనర్ మార్త భానువర్మ పాల్గొన్నారు.